క్లుప్తంగా

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆడిట్



రికార్డులు పరిశీలిస్తున్న ఆడిట్ అధికారులు

పాకాల : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం 2023-2024, 2024-2025వ విద్యా సంవత్సరాలకు సంబంధించి అధికారులు అకడమిక్ ఆడిట్ నిర్వహించారు. కళాశాల విద్యా డైరెక్టర్ ఆదేశాల మేరకు వెదురుకుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాల భౌతికశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ పి.వెంకటేశు, కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల కెమిస్ట్రీ అధ్యాపకుడు డాక్టర్ టి.హరిబాబు ఆడిట్ అధికారులుగా వ్యవహరించారు. ఆడిట్‌లో భాగంగా అధ్యాపకుల రికార్డులతో పాటు, కళాశాలలోని పలు రికార్డులను పరిశీలించారు. రికార్డుల నిర్వహణకు సంబంధించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్వీ రమేశ్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ మాసులామణి, అకడమిక్ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఈశ్వర్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వాకర్స్‌కు మజ్జిగ పంపిణీ



వాకర్స్‌కు మజ్జిగ పంపిణీ చేస్తున్న ఆర్యాట్ కృష్ణప్రసాద్, వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: వినాయక సాగర్ వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం వినాయసాగర్‌లో వాకర్స్ ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వాకర్స్ ఇంటర్నేషనల్ రీజనల్ కౌన్సిలర్ ఆర్యాట్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ వేసవితాపాన్ని తట్టుకునేందుకు వాకర్స్‌కు ఉచితంగా మజ్జిగ, మినరల్ వాటర్‌ను వితరణ చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించని ప్రభుత్వం

తిరుపతి కల్చరల్: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి పది నెలలు గడిచినా ప్రజా సమస్యలపై దృష్టి సారించకపోవడం దుర్మార్గమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు టి.సుబ్రమణ్యం ఆరోపించారు. ప్రజా సమస్యలపై సీపీఎం చేపట్టిన ప్రజా చైతన్యయాత్ర ఆరోరోజు గురువారం సిరిపురం యానాదికాలనీకి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన కాలనీ వాసుల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యానాదికాలనీలో నివాసం ఉంటున్న వారికి తెలుగుగంగ తాగునీరు లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. అలాగే కరెంట్ చార్జీలు గుడిసెల్లో ఉన్నవారు ఒక బల్బు మాత్రమే వాడుతున్నా.. రూ.500 నుంచి రూ. 1000 వరకు వస్తే ఎలా కడతారని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు పాల్గొన్నారు.

నగరంలో నేటి కార్యక్రమాలు

- ఇస్కాన్ రోడ్డులోని రామకృష్ణ మిషన్ ఆశ్రమంలో ఉదయం 6 నుంచి శ్రీకృష్ణ చైతన్య మహాప్రభు జయంతి వేడుకలు
- తిరుమల బైపాస్ రోడ్డులోని కపిలతీర్థం సమీపంలో ఉన్న శ్రీవారి సన్నిధిలో ఉదయం 9 గంటలకు పంగులూరి సీతమ్మ ఆర్యవైశ్య ధర్మ సత్రం డెవలప్‌మెంట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జక్కా సుబ్బురాజు మీడియా సమావేశం
- టీటీడీ పరిపాలన భవనం ఆవరణలోని క్రీడా మైదానంలో ఉదయం 10 గంటల నుంచి క్రీడా పోటీలు
- ఎస్వీ వేద విశ్వవిద్యాలయం పరిపాలన భవనం రామేశ్వరంలో ఉదయం 10 గంటలకు ఆగమ సిద్ధాంతంపై అంతర్జాతీయ కార్యాశాల ప్రారంభం
- మెగా కార్పొరేట్ టీ–20 క్రికెట్ లీగ్ సెవన్త్ ఎడిషన్–2025లో భాగంగా ఎస్వీయూనివర్సిటీ మైదానంలో ఉదయం 10 గంటలకు క్రికెట్ లీగ్ పోటీలు
- విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కేంద్ర, కార్మిక సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఉదయం 10.30 గంటలకు ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన కార్యక్రమం
- యూత్ హాస్టల్లో ఉదయం 10 గంటలకు 'తమసోమా జ్యోతిర్గమయి' పుస్తకావిష్కరణ
- నగర పాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు బీపీఎస్, ఎల్ఆర్ఎస్ మేళా నిర్వహణ
- పౌర్ణమి సందర్భంగా రాత్రి 7 నుంచి 9 గంటల వరకు శ్రీగోవిందరాజస్వామి గరుడ వాహనం ఊరేగింపు

గొడుగే అండ..



తిరుపతి నగరంలో గురువారం ఎండ తీవ్రత ఎక్కువగా కనిపించింది. ఉదయం 10 గంటల నుంచే భానుడి సెగ మొదలైంది. ఈ నేపథ్యంలో ఎండను తట్టుకోలేక తిరుపతి నగరంలో పలువురు కాలేజీ విద్యార్థులు గొడుగులు పట్టుకుని వెళ్లడం కనిపించింది. ఈ దృశ్యాలను సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది

ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

ఏంది రుయా సంగతి ?

రాయలసీమలోనే అతి పెద్ద ఆస్పత్రి అయిన రుయాకు కూటమి నేతల గ్రహణం పట్టింది. అధికార మదంతో అధికారులను భయపెడుతున్నారు. పాలనాపరంగా ముందుకు వెళ్లకుండా ఎక్కడికక్కడ కమీషన్ల కోసం కక్కుర్తి పడుతున్నారు. తమ మాటే చెల్లుబాటు కావాలని పంతానికి పోతున్నారు. మాట వినని అధికారులపై వైఎస్సార్‌సీపీ అనే ముద్ర వేసి ఫిర్యాదులు చేసి ఇబ్బంది పెడుతున్నారు.

- రుయాలో ఏం జరుగుతోంది ?
- 13వ తేదీ నుంచి సెలవులో సూపరింటెండెంట్ రవిప్రభు
- కూటమి నేతల ఒత్తిడి తట్టుకోలేక లీవ్ పెట్టినట్లు సమాచారం
- అదే యోచనలో మరికొంతమంది అధికారులు
- కమీషన్ల కోసం అధికారులు, డాక్టర్లపై జనసేన, టీడీపీ నేతల ఒత్తిడి





రుయా ఆస్పత్రి(ఇన్‌సెట్) రవిప్రభు, సూపరింటెండెంట్

తిరుపతి తుడా: కూటమి ప్రభుత్వంలోని బడా నాయకులే కాదు చోటా నాయకులు కూడా అంతటా అధికార దర్పం ప్రదర్శిస్తుండడంతో పని చేయడానికి ప్రభుత్వ అధికారులు భయపడుతున్నారు. కూటమి నేతల అవినీతి, అక్రమాలకు హద్దు లేకుండా పోయింది. ఈ క్రమంలోనే రుయా అధికారులపై తీవ్ర ఒత్తిడి పెరిగింది. రుయా అభివృద్ధి కమిటీ సభ్యుల ప్రతిపాదన మొదలు, రుయాలో దుకాణాల కేటాయింపు, అభివృద్ధి పనుల్లో కమీషన్ల వ్యవహారం, గిరిజన కార్పొరేషన్ దుకాణం కేటాయింపు లాంటి వ్యవహారాల్లో అధికారులపై తీవ్ర ఒత్తిడి తీసుకొస్తుండడంతో అధికారులు బెంబేలెత్తిపోతున్నారు. ఈ వ్యవహారాలు ముదరడంతో తీవ్ర ఒత్తిడికి లోనైన రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు తనకు ఆరోగ్యం సరిగా లేనందున 15 రోజుల పాటు అంటే 13వ తేదీ గురువారం నుంచి 15 రోజుల పాటు సెలవు కావాలని ఉన్నతాధికారుల అనుమతి కోరి వెళ్లారు. ఒత్తిడి నేపథ్యంలో ఆయన మరిన్ని రోజులు సెలవులో కొనసాగే అవకాశం ఉందని ఆస్పత్రి వర్గాలు చెబుతున్నాయి.

గందరగోళంగా ఆస్పత్రి నిర్వహణ

పేదలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు సహకరించాల్సిన జనసేన, టీడీపీ నేతలు రుయా ఆస్పత్రిని రాజకీయాలకు కేంద్రబిందువుగా చేసుకున్నారు. ఒక పార్టీ నేతలు అవునంటే మరొక పార్టీ నేతలు అలా కాదంటూ అధికారులపై పెత్తనం చలాయిస్తున్నారు. రుయా ఆస్పత్రిలో జరిగే అభివృద్ధి పనుల్లో కమీషన్ల కోసం ఓ ప్రజా ప్రతినిధి అధికారులపై ఒత్తిడి తెచ్చారు. కాంట్రాక్టు పనులు తమ చేతిలో ఉండవని, ఈ పనులను పర్యవేక్షించేందుకు మరో శాఖ ఉందని ఎంత చెప్పినా ఆ ప్రజాప్రతినిధి సదరు అధికారి మాట వినలేదు. ఈ క్రమంలో రుయా అధికారిపై ఆయన కన్నెర్ర చేశారు. ఇటీవల ఆస్పత్రిలోని 12 దుకాణాలకు టెండర్లను పిలిచిన విషయం తెలిసిందే. టెండర్‌కు వెళ్లకుండా నామినేషన్ పద్ధతిన తమ వారికి కేటాయించాలని జనసేన, టీడీపీ నేతలు పోటీపడి రుయా అధికారులపై తీవ్ర ఒత్తిడి తెచ్చారు. ఉన్నతాధికారుల జోక్యంతో సీల్డ్ కవర్ టెండర్లు నిర్వహించారు. తమ మాట వినలేదన్న అక్కసు పెంచుకున్న కూటమి నేతలు రుయాలో గందరగోళం సృష్టిస్తున్నారు. గిరిజన కార్పొరేషన్ అనుమతులు పొంది ఇటీవల రూయాలో దుకాణం వెలిసింది. దీని కేటాయింపు కోసం అధికారులు అడ్డగోలుగా వ్యవహరించక తప్పలేదు. దుకాణానికి స్థలం కేటాయింపు, అద్దె నిర్ణయం, అనుమతి లేని జంక్ ఫుడ్స్ టిఫిన్ సెంటర్ నిర్వహించడం వంటి అంశాలు తీవ్ర వివాదానికి కారణమయ్యాయి. ఈ వ్యవహారం డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ వరకు చేరింది. అభివృద్ధి కమిటీ సభ్యులుగా నియమితులైన ఇద్దరు నేతలతో అధికారులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తోంది. కొంతమంది జనసేన, టీడీపీ నేతలు రుయా, అధికారులపై అడ్డగోలుగా సోషల్ మీడియాలో ప్రచారం చేయిస్తుండడం, వార్తలు రాయిస్తుండడం తలనొప్పిగా మారింది. ఈ క్రమంలోనే రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు ఒత్తిడి తట్టుకోలేక సెలవుపై వెళ్ళారని ఆసుపత్రి వర్గాలు చెబుతున్నాయి.

ఐఏఎస్‌లకూ తప్పని ఒత్తిడి

కూటమి నేతల ఒత్తిడి ఐఏఎస్ స్థాయి అధికారులకు కూడా తప్పడం లేదు. ఇటీవల తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌పై కూడా టీడీపీ, జనసేన నేతలు ఒత్తిడి తెచ్చిన విషయం తెలిసిందే. టీడీపీ నేతకు చాంబర్ కేటాయించాలని, అలాగే అభివృద్ధి పనులు నామినేషన్ పద్ధతిన కేటాయించాలని ఏకంగా కమిషనర్‌ను బెదిరించిన విషయం సంచలనంగా మారింది. ఇలా అన్ని శాఖల అధికారులకు కూటమినేతల ఒత్తిడి, బెదిరింపులు తప్పడం లేదు.

వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుల నియామకం

తిరుపతి రూరల్: చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాలకు పార్టీ అధ్యక్షులను నియమిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. చంద్రగిరి మండలం వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా కొటాల చంద్రశేఖర్ రెడ్డి, రామచంద్రాపురం మండల పార్టీ అధ్యక్షుడిగా ఎద్దల చంద్రశేఖర్ రెడ్డి, తిరుపతి రూరల్ మండల పార్టీ అధ్యక్షుడిగా కొత్తపాటి మునీశ్వర్ రెడ్డి, చిన్నగొట్టిగల్లు మండల పార్టీ అధ్యక్షుడిగా సింహాల మోహన్, ఎర్రావారిపాళెం మండల పార్టీ అధ్యక్షుడిగా నాగార్జున రెడ్డి, పాకాల మండల పార్టీ అధ్యక్షుడిగా నంగా నరేష్ రెడ్డిని నియమించారు. చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సిఫార్సుల మేరకు వీరికి మండల పార్టీ పదవులు వరించాయి. ఈ మేరకు వారు చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా



ట్రాక్టర్‌ని జేసీబీ సాయంతో బయటకు తీస్తున్న స్థానికులు

పాకాల : చెరువు కట్టపై ప్రయాణిస్తున్న ట్రాక్టర్ ఒక్కసారిగా చెరువులోకి బోల్తా పడిన సంఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఉప్పరపల్లి పంచాయతీ పరిధిలోని ఊట్లవారిపల్లి కర్ణం చెరువు కట్టపై నగిరిఇండ్లు గ్రామానికి చెందిన కృష్ణమూర్తి ట్రాక్టర్‌ను చెరువు కట్టపై నడుపుకుంటూ వెళ్తుండగా ఎదురుగా పాకాల వైపు ఒక కారు వేగంగా వచ్చింది. దీంతో ఆ కారును తప్పించబోయి ట్రాక్టర్ చెరువులోకి పడిపోయింది. గమనించిన స్థానికులు జేసీబీ సహాయంతో ట్రాక్టర్‌ను చెరువు నుంచి బయటకు తీశారు. అదృష్టవశాత్తు ట్రాక్టర్‌లో ఉన్న ఇద్దరు వ్యక్తులు సురక్షితంగా బయట పడ్డారు.

నేటి సమాజంలో సోషల్ మీడియానే కీలకం



సోషల్ మీడియా ప్రాధాన్యత గురించి వివరిస్తున్న అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం : కూటమి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను, వైఎస్సార్‌సీపీ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో సోషల్ మీడియా క్రియాశీలకంగా వ్యవహరించాలని వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్ రెడ్డి సూచించారు. తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గురువారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సోషల్ మీడియా వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ సోషల్ మీడియా ఎంతో శక్తివంతమైందన్నారు. ఇందులో ఎక్కడా వ్యక్తిగత దూషణలు, అవమానకరమైన వ్యాఖ్యలు చేయరాదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యం బలపడేందుకు మంచి ప్రతిపక్షం అవసరమని, వ్యతిరేక అభిప్రాయాలను గౌరవించడమే నిజమైన రాజకీయ సంస్కృతి అని ఆయన అభిప్రాయపడ్డారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీవవైవిధ్య సంరక్షణకు అడుగులు



మాట్లాడుతున్న ఏపీ బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలయపాలెం విజయకుమార్

తిరుపతి మంగళం : రాష్ట్ర ఆటవీ పరిధిలోని అరుదైన జీవ, వృక్ష జాతులను కాపాడుకుంటూ, మనిషి మనుగడ సాగించే విధంగా కార్యాచరణ రూపొందిస్తున్నామని ఏపీ బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలయపాలెం విజయకుమార్ వెల్లడించారు. తిరుపతి నగరంలోని ఓ ప్రైవేటు హోటల్లో గురువారం ఆయన బోర్డు మెంబర్ సెక్రటరీ రామకృష్ణతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో జీవవైవిధ్య మండలి లక్ష్యాలు నీరుగారిపోయాయన్నారు. ఇందులో భాగంగానే రాజధాని అమరావతి, వైజాగ్, తిరుపతిలో బయోడైవర్సిటీ పార్కులు ఏర్పాటు చేయనున్నట్టు స్పష్టం చేశారు. తిరుపతిలో 110 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసేందుకు టీటీడీ యాజమాన్యం, జిల్లా కలెక్టర్‌తో చర్చలు జరిపామని చెప్పారు. వచ్చే రెండు, మూడేళ్లలో 13 ఉమ్మడి జిల్లాల పరిధిలోనూ బయోడైవర్సిటీ పార్కులు ఏర్పాటు చేస్తామన్నారు. తిరుపతి జిల్లా పరిధిలోని తలకోన, తిరుపతిలోని కపిల తీర్థం ఏరియాను బయోడైవర్సిటీ హెరిటేజ్ ప్రదేశాలుగా ప్రకటించేలా రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పెట్టామన్నారు. తిరుమల పరిధిలోని జాపాలి తీర్థం, పుత్తూరు పరిధిలోని కైలాసకోనను బయోడైవర్సిటీ పవిత్ర ప్రదేశాలుగా ప్రభుత్వం ప్రకటించబోతోందన్నారు. తిరుపతి కేంద్రంగా నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ, ఏపీ బయోడైవర్సిటీ బోర్డు నేతృత్వంలో నగరంలోని మానస సరోవర్ హోటల్ వేదికగా శుక్ర, శనివారాల్లో రెండు రోజుల పాటు నిపుణుల కమిటీ(ఎక్స్‌పర్ట్ కమిటీ) సమావేశం జరగనుందని తెలిపారు.

ఘనంగా వార్షికోత్సవం



వేడుకలను ప్రారంభిస్తున్న అతిథులు, కళాశాల అధినేత

తిరుపతి కల్చరల్: నేటి ఆధునిక సమాజంలో ప్రతి విద్యార్థి మంచి స్నేహం, పుస్తక జ్ఞానంతో తమ ఉజ్వల భవితను తీర్చిదిద్దుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. ఎస్‌డీహెచ్‌ఆర్ డిగ్రీ, పీజీ కళాశాల వార్షికోత్సవం గురువారం మహతి కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వక్తలుగా ప్రముఖ సినీ గాయకుడు వందేమాతరం శ్రీనివాస్, ఇస్కాన్ ప్రతినిధి రూపేష్ ప్రభు హాజరయ్యారు. ఈ సందర్భంగా వందేమాతరం శ్రీనివాస్, రూపేష్ ప్రభు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో అగ్రగామి సంస్థగా ఎస్‌డీహెచ్‌ఆర్ నిలవడానికి విద్యార్థులు, తల్లిదండ్రుల ఆదరణ కారణమన్నారు. వందేమాతరం శ్రీనివాస్ బృందం ప్రదర్శించిన సినీ గీతాలాపన ఉర్రూతలూగించగా, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డీవీఎస్ చక్రవర్తిరెడ్డి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

అరవిందలో గ్లకోమా వారోత్సవాలు



ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బాలకృష్ణనాయక్

తిరుపతి తుడా: అరవింద కంటి ఆస్పత్రిలో గురువారం ప్రపంచ గ్లకోమా వారోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బాలకృష్ణనాయక్ ముఖ్యఅతిథిగా హాజరై అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆస్పత్రికి వచ్చిన వైద్యులకు గ్లకోమా వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ అధిక ఒత్తిడి కారణంగా గ్లకోమా కంటి వ్యాధి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఇది కోలుకోలేని అంధత్వానికి కారణమవుతుందన్నారు. గ్లకోమా రహిత ప్రపంచం కోసం ఐక్యంగా ఉన్నాం అనే నినాదంతో మార్చి 9 నుంచి 15 వరకు ప్రపంచ గ్లకోమా వారోత్సవాలను నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో అరవింద ఐకేర్ పద్మశ్రీ డాక్టర్ పెరుమాళ్ స్వామి, ఆసుపత్రి ప్రతినిధులు డాక్టర్ మధుబాబు, డాక్టర్ అశోకవర్ధన్, శ్రీనాథ్ పాల్గొన్నారు.

ఆహార నియమాలతో కిడ్నీలకు రక్షణ



ప్రపంచ కిడ్నీ దినోత్సవం జరుపుకుంటున్న నెఫ్రాలజీ ప్రొఫెసర్లు, టెక్నీషియన్లు

తిరుపతి కల్చరల్: కిడ్నీల పట్ల అవగాహన, అప్రమత్తంగా వ్యవహరించడంతో పాటు మంచి ఆహార నియమాలు పాటిస్తే కిడ్నీల సురక్షత కలిగి ఆరోగ్యవంతమైన జీవితం గడపవచ్చని, ఆ దిశగా ప్రజలు జాగృత వహించాలని నెఫ్రా లజీ ప్రొఫెసర్లు డాక్టర్ సునీత, డాక్టర్ రవికుమా ర్ తెలిపారు. రుయా ఆస్పత్రిలోని నెఫ్రాలజీ విభాగంలో గురువారం ప్రపంచ కిడ్నీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో ప్రతి ఒక్కరూ మంచి ఆహారం తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ దేవి ప్రియ, సీనియర్ డయాలసిస్ టెక్నీషియన్స్ శివ మేడికుర్తి, పాటూరు ప్రనూష, సాహుల్, యా మినితో పాటు ఎస్వీ మెడికల్ కళాశాల డయాలసిస్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

చంద్రగిరి: మండల బీజేపీ అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి ఆధ్వర్యంలో గురువారం పలువురు బీజేపీలో చేరినట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. మండల పరిధిలోని శానంబట్ల గ్రామానికి చెందిన మురళి రెడ్డితో పాటు డి.వి.రమణను స్థానిక పార్టీ ముఖ్య నేతల ఆధ్వర్యంలో బీజేపీ కండువా కప్పి ఆహ్వానించారు. నేతలు మాట్లాడుతూ చంద్రగిరిలో బీజేపీ బలోపేతం కోసం సమిష్టిగా పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం ఆ పార్టీ సీనియర్ నాయకులు మునిగంగి రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుబ్రమణ్యం యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట మునిని దుశ్శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక బీజేపీ నేతలు పాల్గొన్నారు.

'ఆ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలి'



వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

తిరుపతి తుడా: మత ప్రాతిపదికన డాక్టర్ల నియామకాలను చేపట్టేందుకు జారీ చేసిన నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, జేబీఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ నాయకులు డిమాండు చేశారు. ఈ మేరకు స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్‌కు గురువారం వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్య, వైద్యసంస్థలు రాజ్యాంగబద్ధంగా నడుస్తాయని, లౌకిక సంస్థల్లో ఇలాంటి మత ప్రాతిపదికంగా నియామకాల నోటిఫికేషన్ ఇవ్వడం టీటీడీ ప్రతిష్ఠను దెబ్బతీసే విధంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే నోటిఫికేషన్‌ను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చలపతి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో మణిపూర్ సీజే



అమ్మవారి ఆలయం వెలుపల మణిపూర్ చీఫ్ జస్టిస్ కృష్ణ కుమార్

తిరుపతి రూరల్: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని గురువారం మణిపూర్ చీఫ్ జస్టిస్ కృష్ణకుమార్ కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు ఆలయ సూపరింటెండెంట్ గోవిందరాజన్ స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకుని అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం ఆయనకు ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఇక మహిళా ర్యాపిడోస్



మహిళలకు ఈబైక్‌లను అందిస్తున్న మెప్మా అధికారులు

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో ఇకపై మహిళా ర్యాపిడోలు హల్‌చల్ చేయనున్నారని మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ రవీంద్ర తెలిపారు. మెప్మా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘంలోని 25 మంది సభ్యులకు గురువారం స్థానిక మెప్మా కార్యాలయం వద్ద ర్యాపిడో ఈ బైక్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా ర్యాపిడోను తీసుకొస్తున్నట్లు ప్రకటించామన్నారు. ఇందులో భాగంగా దరఖాస్తు చేసుకున్న స్వయం సహాయక సభ్యులలోని 25మందికి ఈ బైకులను అందజేసినట్టు వెల్లడించారు. యూబీఐ, ఇండియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా రుణ సహాయంతో ఈ బైక్‌లను మహిళలకు అందించినట్లు తెలిపారు.

రచయిత బొమ్మిశెట్టికి ఘన సన్మానం



ప్రముఖ రచయిత బొమ్మిశెట్టి రమేష్‌ను సత్కరిస్తున్న తిరుపతికి చెందిన రచయితలు

తిరుపతి కల్చరల్: కడప జిల్లా మైదుకూరుకు చెందిన రచయిత, చరిత్రకారుడు బొమ్మిశెట్టి రమేష్‌ను తిరుపతిలోని బ్యాంకు కాలనీలో ప్రముఖ రచయిత ఆర్‌సీ.కృష్ణస్వామి నివాసంలో ఆయనతో పాటు పలువురు రచయితలు గురువారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆర్‌సీ కృష్ణస్వామి మాట్లాడుతూ బొమ్మిశెట్టి రమేష్ రెండు తెలుగు రాష్ట్రాల్లో రచయితగా, చరిత్రకారుడి అత్యద్భుతంగా రాణిస్తున్నారని కొనియాడారు. గత కొన్నేళ్లుగా వీరగల్లులు, శాసనాలు, పురాతన ఆలయాలను వెలికి తీస్తూ వెలుగులోకి తెస్తూ ఆయన సాహిత్య, చరిత్ర సేవ, చరిత్ర పరిరక్షణ కోసం విశేషమైన ప్రతిభ కనబరుస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా రాజు తను రచించిన 'మీది తెనాలి మాది తెనాలి, మేకల బండ, జక్కదొన' వంటి పుస్తకాలను రచయిత రమేష్‌కు అందజేశారు. మరో కథా రచయిత పేరూరు బాలసుబ్రమణ్యం తాను రచించిన మడకెద్దుల పుస్తకాన్ని అందజేశారు. కార్యక్రమంలో కథా రచయిత నాగార్జున శర్మ, రచయితలు పాల్గొన్నారు.

ఆక్రమణలపై విచారణ



సర్వే చేస్తున్న అధికారులు

చంద్రగిరి: ప్రభుత్వ కాలువను ఆక్రమించుకుని ప్రహరీని ఏర్పాటు చేయడంపై రెవెన్యూ అధికారులు స్పందించారు. బుధవారం చంద్రగిరి పట్టణంలోని సర్వే నంబరు 171లోని కాలువను అక్రమించుకుని అక్రమ నిర్మాణం చేపట్టినట్లు దినపత్రికల్లో వార్తలు ప్రచురితమయ్యాయి. దీనిపై స్పందించిన అధికారులు గురువారం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వీఆర్‌ఓ పురుషోత్తం, అశోక్ ఆధ్వర్యంలో సర్వేయర్లు, సచివాలయ సిబ్బంది కాలువను పరిశీలించి, సర్వే చేపట్టారు. ఈ క్రమంలో కాలువకు సంబంధించిన కొంతమేర భూమి కబ్జాకు గురైనట్లు తేల్చారు. ఆపై కాలువకు సంబంధించిన స్థలం వరకు మార్కింగ్ చేశారు. అయితే కాలువ సైతం పట్టా భూముల్లో కాలువ వెళ్తోందని, మాకు ఎలాంటి పరిహారం కూడా ఏ ప్రభుత్వం చెల్లించలేదని భూ యజమానులు అధికారులకు తెలిపారు. మా పట్టా భూమిలో కాలువను పూడ్చి వేస్తామంటూ స్పష్టం చేశారు. దీనిపై రెవెన్యూ అధికారులు స్పందిస్తూ.. కబ్జాకు సంబంధించిన నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని, ఆపై వారి ఆదేశాల మేరకు తగిన చర్యలుంటాయని తెలిపారు.

కవయిత్రి మొల్లమాంబకు నివాళి



కవయిత్రి మొల్లమాంబకు నివాళులు అర్పిస్తున్న పీఠం ప్రతినిధులు, కళాకారులు, రచయితలు



నివాళులు అర్పిస్తున్న బీసీ సంఘర్షణ సమితి నేతలు, రచయితల సంఘ నేతలు

తిరుపతి కల్చరల్: కవయిత్రి మొల్లమాంబ జీవితం అందరికీ ఆదర్శనీయమని పలువురు వక్తలు కొనియాడారు. గురువారం కవయిత్రి మొల్లమాంబ జయంతి సందర్భంగా మొల్లమాంబ కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు కేశవులు ఆధ్వర్యంలో మహతి కళాక్షేత్రం సమీపంలో ఉన్న మొల్ల విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఇందులో బీసీ సంఘర్షణ సమితి అధ్యక్షుడు అక్కినపల్లి లక్ష్మయ్య, వేమన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎం.నాగార్జున, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు సాకం నాగరాజు, సాహితీ విమర్శకుడు గరికపాటి రమేష్‌బాబు, రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి, కార్యదర్శి కేఎస్ రాజా, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, వివిధ బీసీ సంఘ నేతలు, రచయితలు, సాహితీ వేత్తలు, కళాకారులు పాల్గొన్నారు.